సాక్షి
కాకినాడ

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



డేంజర్‌లో ఓజోన్

ఎండ, వాన నుంచి మనకు గొడుగు ఎలా రక్షణ ఇస్తుందో కంటికి కనిపించని ఓజోన్ పొర కూడా భూమిపై జీవరాశిని అలానే కంటికి రెప్పలా కాపాడుతోంది.



శానిటరీ సిబ్బంది ఆకలి కేకలు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శానిటరీ సిబ్బంది జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారు.

8లో

5.54 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం రాత్రి 5,54,609 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు సంబంధించి 11,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలంలో 39.70 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్‌కు 434 అర్జీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 434 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జేడ్పీ సీఈవో లక్ష్మణరావు ఇతర అధికారులు హాజరై కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపి వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి అంశాలపై అర్జీలు అందాయి.

ఐపీఈగా మహబూబ్ బాషా



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నెల్లూరు జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్. ఎస్.కె మహబూబ్ బాషా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఐపీఈ)గా కాకినాడ జిల్లాలో నియమితులయ్యారు. సోమవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరిగిన పాఠశాల క్రీడాసమాఖ్య ఎంపికలకు హాజరైన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కాకినాడ కేంద్రంగా ఉన్న ఐపీఈగా కార్యాలయ అధికారిగా రాష్ట్రంలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూళ్లు, అన్నీ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో వ్యాయామ విద్య.. క్రీడలను పర్యవేక్షిస్తానన్నారు.

కేజీబీవీని పరిశీలించిన స్టేట్ జీసీడీవో భారతి

తొండంగి: మండలంలోని వాకదారిపేట కేజీబీవీ కేంద్రాన్ని స్టేట్ జీసీడీవో (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) బి.భారతి పరిశీలించారు. కేంద్రంలోని టెన్త్, ఇంటర్ విద్యార్థుల విద్యాప్రగతి, తరగతుల నిర్వహణ, పరీక్షల ఫలితాలు, ఆహారపు మెనూ, డైనింగ్‌హాల్, ఇతర పరిసరాలు పరిశీలించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవన్నారు. వసతి గృహం నిర్వహణపై విద్యార్థులను ప్రశ్నించారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆమె వెంట జిల్లా జీసీడీవో పి.ఉమామహేశ్వరీ ఉన్నారు.

సత్రం భూములకు మళ్లీ కౌలు వేలం నిర్వహించాలి

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థానానికి చెందిన సత్రం భూముల కౌలు వేలంలో తమకు అన్యాయం జరిగిందని కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు 57 ఎకరాలకు మళ్లీ కౌలు వేలం నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చిందని బాధిత రైతులు తెలిపారు. రెండు నెలల క్రితం తొండంగి శివాలయంలో దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు 478 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో అధికారులు కూటమి నేతల ఒత్తిడికి గురై తమకు నచ్చిన వారికి భూములు కట్టబెట్టారంటూ అప్పట్లో కొద్ది మంది రైతులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో దాదాపు 12 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు అనంతరం హైకోర్టు 57 ఎకరాలకు మళ్లీ కౌలు వేలం నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు కౌలు వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని శ్రీసంస్థాన సత్రం ఈవో శివబాబు తెలిపారు.

తపాల శాఖలో ఆధార్ సేవలు మరింత విస్తృతం



అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జయశంకర్

అమలాపురం టౌన్: ప్రజల అవసరాలకు అనుగుణంగా తపాలా శాఖ అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలోని ఆధార్ కౌంటర్ సేవలను మరింత విస్తృతం చేసిందని విశాఖపట్నం రీజినల్ పోస్ట్ మాస్టర్ జనరల్ వీఎస్ జయశంకర్ అన్నారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ ఎక్స్‌టెన్షన్ ఆధార్ కౌంటర్‌ను జయశంకర్ సోమవారం ప్రారంభించి ప్రసంగించారు. ఈ కౌంటర్ ఇక నుంచి ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ రెండు షిఫ్టుల్లో పనిచేస్తుందన్నారు. గతంలో ఉన్న కౌంటర్ పనిచేసే సమయాన్ని మరింత పెంచి ఈ సేవలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అమలాపురం పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, పోస్ట్ మాస్టర్ బి.వెంకన్నతో పాటు తపాలా సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యానికి పత్రికలే పట్టుగొమ్మలు



ప్రజాస్వామ్యానికి పత్రికలే పట్టుగొమ్మలు. అలాంటి పత్రికలపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికలపై దాడులు ఎక్కువయ్యాయి. ప్రశ్నించే గొంతును నొక్కాలని చూస్తోంది. నిజాలను వెలికితీస్తున్న 'సాక్షి' పత్రిక, పత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయరెడ్డి కూటమి సర్కార్ అక్కసు వెళ్లగక్కుతోంది. పోలీసు వ్యవస్థలో లోటుపాట్ల గురించి రాస్తే పత్రికా యాజమాన్యంపై కేసులు నమోదు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.

– తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే, గోపాలపురం

పత్రికలపై కేసులు అప్రజాస్వామికం



పాలనా పరమైన తప్పిదాలను ఎత్తి చూపినందుకు 'సాక్షి' పత్రికపైనా, ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపైనా కేసులు పెట్టడం అప్రజాస్వామికం. పత్రికా స్వేచ్ఛను హరించే చర్యలను కొనసాగిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమంటూ ప్రజల గొంతుకగా పత్రికలు తమ పాత్రను పోషిస్తాయి. ప్రజల తరపున నిలుస్తూ ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపిన వారిపై కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుంది. ఇది మంచి సంస్కృతి కానే కాదు.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, కో ఆర్డినేటర్, మండపేట

పవన్ హామీ గాలికేనా?

- 'బాబు' బాటలోనే ఆయన పయనం
- నిలదీస్తున్న సబ్‌ప్లాన్ ఏరియా గిరిజనం
- 35 వేల మంది ఎదురుచూపులు
- తెరపైకి పెదమల్లాపురం ప్రత్యేక మండలం



పెదమల్లాపురం గిరిజన గ్రామం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న పెదమల్లాపురం కేంద్రంగా మండలం లేదా ఐటీడీఏ హోదా ప్రతిపాదన తిరిగి తెరపైకి వచ్చింది. నాలుగు దశాబ్దాలుగా ఇందుకోసం పోరాడుతున్న గిరిజన సంఘాలకు సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టమైన హామీ ఇచ్చి గిరిజనంలో ఆశలు రేకెత్తించారు. గద్దెనెక్కి ఉప ముఖ్యమంత్రిగా పదవినధిష్టించి 14 నెలలు దాటిపోతున్నా పవన్ ఇచ్చిన హామీపై ఉలుకు, పలుకులేదని గిరిజనం మండిపడుతోంది. నాడు 40 ఏళ్ల సమస్యకు పరిష్కరిస్తానని పవన్ కల్యాణ్ గొప్పలకు పోయారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏలేశ్వరం రోడ్‌షోలో పాల్గొన్న పవన్ కల్యాణ్ పెదమల్లాపురం గిరిజన మండలం ఏర్పాటుచేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాటి ఎన్నికల ప్రచార సభలో పెదమల్లాపురం గిరిజన సాధన కమిటీ ప్రతినిధులు బి.బాలరాజు, జర్ల ముసలయ్య, ఆదివాసీ సంఘ సభ్యులకు ఈ మేరకు పవన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ప్రత్యేక ప్రతిపత్తిపై పవన్ పెదవి విప్పడం లేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబుతో జతకట్టి కూటమిగా వచ్చిన పవన్ కల్యాణ్ మాట ఇవ్వడం, ఇచ్చిన మాట తప్పడంలో బాబు బాటలోనే పయనిస్తున్నట్టు కనిపిస్తోందని సబ్‌ప్లాన్ ఏరియా గిరిజనులు ఆక్షేపిస్తున్నారు.

ఇన్నేళ్లకు మళ్లీ..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలు, మండలాల పునర్విభజనకు సిద్ధమవుతుండటంతో తెరమరుగైన పెదమల్లాపురం కేంద్రంగా ఐటీడీఏ ప్రతిపాదన మళ్లీ పురుడు పోసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా వై.రామవరం సమీపాన గుర్తేడు కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలనే కసరత్తు జరుగుతోంది. ఈ క్రమంలో సబ్‌ప్లాన్ ఏరియా గిరిజనులు పెదమల్లాపురం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఉప ప్రణాళికా ప్రాంతం (సబ్‌ప్లాన్ ఏరియా)లోని సుమారు 35వేల మంది గిరిజనులు ప్రత్యేక మండలం కోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లోని శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం, కోటనందూరు మండలాల పరిధిలో 59 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయి. వీటిలో 40వేల మంది ఉంటే 90శాతం అంటే 32 వేల మంది గిరిజనులే ఉన్నారు. ఈ గిరిజన గ్రామాలన్నీ రంపచోడవరం ఐటీడీఏ (సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ) పరిధిలో ఉండేవి. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్నా తమను సవతితల్లి బిడ్డల్లా చూస్తున్నారని ఎన్నో ఏళ్లగా సబ్‌ప్లాన్ ఏరియా గిరిజనం ఆవేదన చెందుతూనే ఉంది. ఈ ప్రాంతాన్నంతటిని కలిపి పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు చేయడం కోసం నాలుగు దశాబ్దాలుగా ఉప ప్రణాళికా ప్రాంతంలో గిరిజనం పలు దఫాలుగా పోరాటాలు చేస్తూనే ఉంది. 1980వ దశకం నుంచి ఈ డిమాండ్‌తో అడపా,దడపా గిరిజనులు ఆందోళనలు చేస్తున్నారు. ఇన్నేళ్ల తరువాత ఉద్యమానికి కూటమి ప్రభుత్వమే మళ్లీ ఊపిరి పోసిందంటున్నారు.

మరోసారి పోరుబాట

జిల్లాల పునర్విభజన, మండలాలు, గ్రామాల విలీనం, విభజన, పేర్లు మార్పు వంటి ప్రతిపాదనలకు ప్రభుత్వం తెరతీసింది. ఇది ఎంతవరకు అమలవుతుందో తెలియదు కాని పాత డిమాండ్లు తిరిగి మొగ్గ తొడగడంతో కూటమి సర్కార్‌కు బొప్పికట్టడం ఖాయమంటున్నారు. 40 ఏళ్లుగా డిమాండ్ చేస్తోన్న జిల్లాలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనం ప్రత్యేక మండలం లేదా, ప్రత్యేక ఐటీడీఏ కోసం మరోసారి పోరుబాట పట్టారు. సంక్షేమ పథకాలు, ఐటీడీఏ కల్పించే మౌలిక సదుపాయాలు అందని ద్రాక్షగా మిగలడం, కొండపోడు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ఉపాధి అవకాశాలు మందగించిన నేపథ్యంలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనం పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక ఐటీడీఏ లేదా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలనే డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా ఉండగా మెట్టప్రాంతంలో కలిఐసి ఉన్న నాలుగు మండలాల పరిధిలో 59 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల గిరిజనులకు రంపచోడవరం ఐటీడీఏ కేంద్రంగా ఉండేది. అయినా గిరిజనులకు అందే సదుపాయాలు వీరికి దక్కేవి కావు. ఈ క్రమంలో గిరిజన హక్కుల సాధన సంఘం, **కొండ రెడ్డి, కమ్మర, శృంగధార గిరిజన సంక్షేమ సంఘం, ఆదివాసీ గిరిజన సంఘాలు అన్నీ కలిసి పెదమల్లాపురం మండల సాధన కమిటీగా ఆవిర్భవించాయి. ప్రత్యేక మండలం కోసం ఈ సంఘాల సమూహం ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు 1985** నుంచి ఎదుర్కొంటోన్న ప్రధాన సమస్యలపై అనేక సందర్భాల్లో విజ్ఞాపనలు అందచేశారు. పెదమల్లాపురం కేంద్రంగా ఐటీడీఏ లేదా,ప్రత్యేక గిరిజన మండల ఏర్పాటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమంటున్నారు.

'దారి' చూపండి

శంఖవరం–వేళంగి మధ్య 18 కిలోమీటర్లు, స్పందన–జల్దాం మధ్య రోడ్డు, సిద్ధివారిపాలెం జంక్షన్ నుంచి యరకాపురం వరకు 6 కిలోమీటర్ల తారురోడ్డు, వేళంగి నుంచి ఆవెల్తి, అనుమర్తి, ఓంద్రేగుల, పెదూరు వరకు 14 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మించాలి, మాసంపల్లి నుంచి గొంది, రాజావరం, వేళంగి నుంచి వాతంగి, జీ కొత్తపల్లి నుంచి గొంది, మాతయ్యపేట నుంచి జల్దాం, చల్లూరు, దబ్బాది, సార్లంక, చల్లూరు నుంచి గిన్నెలారం, సార్లంక నుంచి లోదొడ్డి, రాఘవపట్నం నుంచి నాతవరం మండలం మాసంపల్లి, ద్వాపర్తి నుంచి ఉత్తరకంచి, పాండవులపాలెం నుంచి కిత్తుమూరిపేట, పెద్దిపాలెం నుంచి గోకవరం, మెట్టుచింత, ఉల్లిగోగుల మీదుగా మారేడుబాక, పెద్దిపాలెం నుంచి వంతాడ, కిత్తుమూరిపేట నుంచి బాపన్నధార, కె.మిర్తివాడ నుంచి కొండపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణం కోసం వీరు డిమాండ్ చేస్తున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



సార్వత్రిక ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ **గిరిజనానికి ఇచ్చిన** హామీ నిలబె**ట్టుకోవాలి.** గిరిజనులు రోజుల **తరబడి ఉద్యమాలు** చేసిన చరిత్ర **ఉంది.** పెదమల్లాపురం కేంద్రంగా మండలం **ఏర్పాటు చేసి ఐటీ**డీఏ హోదా కల్పిస్తే యువ**తకు ఉద్యోగ, ఉపా**ధి అవకాశాలు లభిస్తాయి.

– జర్తా ముసలయ్య, జిల్లా అధ్యక్షుడు, గిరిజన హక్కుల సాధన సంఘం, పెదమల్లాపురం

ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



గిరిజనులు 6వ షెడ్యూల్‌లో ఉండటంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కానీ సబ్‌ప్లాన్ ఏరియాలో నాన్ షెడ్యూల్ పరిధిలో ఉండటంతో రాజ్యాంగం కల్పించిన హక్కులు దక్కడం లేదు. 1985లో శంఖవరంలో మినీ ఐటీడీఏ ఉండేది. అదే తరహాలో ఏర్పాటు చెయ్యాలి.

– బూసరి బాలరాజు, జిల్లా కార్యదర్శి, గిరిజన హక్కుల సాధన సంఘం, ధారమల్లాపురం

అభివృద్ధికి దూరంగా నాన్ షెడ్యూల్ గ్రామాలు



సబ్‌ప్లాన్ ఏరియాలో గ్రామాలు నాన్ షెడ్యూల్ పరిధిలో ఉండటం వల్ల 2 శాతం సబ్ ప్లాన్ నిధులు కూడా రావడం లేదు. ఫలితంగా ఈ పరిధిలో గ్రామాలు మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. ట్రైకార్ పథకం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అందివలసిన రుణాలు కూడా అందడంలేదు.

– తరుం నాగేశ్వరరావు, గిరిజన నేత, పెదమల్లాపురం

కుల ధ్రువీకరణ పత్రాలకు దిక్కులేదు



ఈ ప్రాంత గిరిజనులకు పెద్దాపురం ఆర్డీఓ ద్వారా ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చెయ్యాల్సి ఉంటుంది. ఆర్డీఓ బదిలీ అయిన ప్రతిసారీ బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ ఇక్కడ పరిస్థితిని అర్థం చేసుకొనేంత వరకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చెయ్యడం లేదు. దీనివల్ల ఇంటర్ తర్వాత ఉన్నత విద్యకు వెళ్లలేని పరిస్థితి. స్కాలర్ షిప్‌లకు దూరమవుతున్నారు.

– జర్తా దుర్గా దేవి, నిరుద్యోగ యువతి, బవురువాక

డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓపై విచారణకు ఆదేశం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ డీఎల్‌పీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటరెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై డీఆర్వో జె.వెంకట్రావు విచారణకు ఆదేశించారు. పలువురు ఎస్సీ, బీసీ ఉద్యోగులపై తప్పుడు గ్రీవెన్స్ ఫిర్యాదులు చేయిస్తూ ఆ ఫిర్యాదులు క్లోజ్ చేయడానికి సదరు ఉద్యోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపై సోషల్ వేల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ శోభారాణిని విచారణ అధికారిగా నియమించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ పి.చెంగల్‌రావు ఆధ్వర్యంలో పలు దళిత గిరిజన సంఘాల నాయకులు ఈ విషయంపై సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు.



డీఎల్‌పీఓ కార్యాలయ ఏవోపై ఫిర్యాదు చేస్తున్న దళిత, గిరిజన సంఘాల నాయకులు

ఈ ఫిర్యాదుపై స్పందించిన డీఆర్వో విచారణ అధికారిని నియమించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులపై సంబంధం లేని వ్యక్తులతో తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఉద్యోగం ఇప్పించే విషయంలో, బెనిఫిట్స్ ఇచ్చే విషయంలో మహిళలను కావాలనే ఉద్దేశపూర్వకంగా తన చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంకటరెడ్డి ఫోన్ కాల్ హిస్టరీని పరిశీలిస్తే నిజాలు బయటికి వస్తాయన్నారు. డీఆర్వోకు ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు, జై భీమ్‌రావు భారత్ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ, బహుజన సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై సుప్రీం స్టేను స్వాగతిస్తున్నాం




షేక్ అబ్దుల్ ఖాదర్

అమలాపురం టౌన్: వక్ఫ్ చట్టం–2025పై సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన మధ్యంతర తీర్పు(స్టే)ను ముస్లింలు స్వాగతిస్తున్నారని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. ఈ వివాదాస్పద చట్టాన్ని పార్లమెంట్ ఉభయ సభలు, రాష్ట్రపతి నుంచి ఆమోద ముద్ర పడినప్పటికీ ఈ చట్టానికి వ్యతిరేకంగా వందలకు పైగా కేసులు వేయడంతో సుప్రీంకోర్టు విచారణకు వచ్చిందని చెప్పారు. అమలాపురంలో ఖాదర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివాదాస్పద చట్టం గురించి వివరించారు. కోర్టు ఇచ్చిన స్టేను అనుసరించి కింది స్థాయిలో అధికారాలను డీనోటిఫై చేసేందుకు అనుమతించలేదు. వక్ఫ్ ట్రిబ్యునల్ ద్వారానే జరగాలన్న నిబంధన విధించిందని చెప్పారు. అలాగే కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర కౌన్సిల్‌లో ముస్లిమేతరులను నియమించే అంశంపై కూడా కోర్టు స్టే ఇవ్వడంపై ఖాదర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్ట సవరణలో అనేక లొసుగులు ఉన్నాయని ఆనాడే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ వ్యాఖ్యానించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాడు జగన్ పార్లమెంట్ ఉభయ సభల్లో తమ పార్టీ ఎంపీలతో బిల్లుకు వ్యతిరేకంగా ఓట్లు వేయించి ముస్లిం పక్షపాతిగా నిలబడ్డారని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ ఈ బిల్లుకు అనుకూలంగా ఓట్లు వేసి ముస్లింలకు ద్రోహం చేసిందన్నారు. ఇప్పటికైనా ముస్లిం సమాజం మైనార్టీల పట్ల ఏ పార్టీ ప్రేమాభిమానాలు చూపిస్తుందో గ్రహించాలని ఖాదర్ హితవు పలికారు.

డీఎస్సీ తుది జాబితా విడుదల

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1349 పోస్టుల భర్తీ
- దసరా సెలవుల తర్వాత కొలువుదీరే అవకాశం
- ఈ నెల 22 నుంచి కొత్త టీచర్లకు 8 రోజుల శిక్షణ



శిక్షణ పొందిన ఉపాధ్యాయ అభ్యర్థులు (ఫైల్)

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో టీచర్ పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. సోమవారం ఉదయం డీఎస్సీ–2025 తుది జాబితాను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. క్యాడర్ల వారీగా ఎంపికైన ఉపాధ్యాయుల జాబితాను ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 1,349 పోస్టులకు టీచర్ అభ్యర్థులను ఎంపిక చేశారు. వివిధ కారణాలతో నాలుగు పోస్టులు భర్తీ కాలేదు. కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 22 నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలో సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు స్కూల్ అసిస్టెంట్ స్టేట్ రీసోర్స్ పర్సన్స్(ఎస్ఆర్పీ)కు గుంటూరు జిల్లా పరిధిలోని విట్ యూనివర్శిటీ, ఎస్జీటీ ఎస్ఆర్పీలకు ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని హిల్ ప్యారడైజ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. దసరా సెలవుల అనంతరం కొత్త టీచర్లు కొలువు దీరే అవకాశముంది.

ఐదు నెలల అనంతరం

డీఎస్సీ–2025 ఫలితాలను సుమారు ఐదు నెలల అనంతరం విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న ఉమ్మడి జిల్లా పరిధిలోని 1,241 మైదాన (ప్లెయిన్ ఏరియా) పోస్టులకు, 112 ఏజెన్సీ ఏరియా పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 1,352 పోస్టులకు 63,004 మంది దరఖాస్తు చేయగా, జూన్ 6వ తేదీ నుంచి సీబీటీ విధానంలో నిర్వహించిన పరీక్షలకు 38,617 మంది హాజరయ్యారు. జూలై 5న ప్రాథమిక కీ విడుదల చేయగా, ఫైనల్ కీ జూలై 31న ఫైనల్ కీ విడుదల చేశారు. ఆగస్టు 23న మెరిట్ లిస్ట్ విడుదల చేయగా, ఆగస్టు 28న ప్రారంభమైన సర్టిఫికెట్ వెరిఫికేషన్ నాలుగు విడతల్లో చేపట్టారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం సోమవారం డీఎస్సీ–2025 రాష్ట్ర కన్వీనర్ తుది ఎంపిక జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు.

ఎంపికయిన పోస్టుల్లో ఎస్జీటీ పోస్టులు 421 కాగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 818 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధికంగా ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆ తర్వాత సోషల్ స్టడీస్, బయాలజీ పోస్టులు మూడంకెల సంఖ్యలో ఉండగా, ఇంగ్లీషు, తెలుగు, హిందీ, గణితం, పీఎస్ సబ్జెక్టులు రెండంకెల్లో ఉన్నాయి. సంస్కృతం కేవలం ఐదు పోస్టులు భర్తీ అవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం 112 పోస్టులకు అభ్యర్థులు సెలెక్ట్ అయ్యారు. ఎస్జీటీలు 104, ఫిజికల్ సైన్స్ మూడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒకటి, బయోలాజికల్ సైన్స్ నాలుగు పోస్టులు భర్తీ అయ్యాయి. ఎస్జీటీ విభాగంలో స్థానిక సంస్థల్లో ఒకటి, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక్కో పోస్టు వంతున భర్తీ కాలేదు. అలాగే సంస్కృతం విభాగంలో స్థానిక సంస్థల మేనేజ్‌మెంట్‌లో రెండు పోస్టులు భర్తీ కాలేదు.

క్యాడర్లు, మేనేజ్‌మెంట్ వారీగా ఎంపికైన ఉపాధ్యాయుల వివరాలు

క్యాడర్	సబ్జెక్టు	ఎంపికైన టీచర్ల సంఖ్య
ఎస్ఏ	ఇంగ్లీషు	95
ఎస్ఏ	హిందీ	78
ఎస్ఏ	సంస్కృతం	05
ఎస్ఏ	తెలుగు	58
ఎస్ఏ	బయాలజీ	103
ఎస్ఏ	గణితం	64
ఎస్ఏ	ఫిజికల్ ఎడ్యుకేషన్	210
ఎస్ఏ	ఫిజికల్ సైన్స్	71
ఎస్ఏ	సోషల్ స్టడీస్	132
ఎస్జీటీ	ఎస్‌జీటీ తెలుగు	421

అర్హత ఉన్న అభ్యర్థులు లేక..

డీఎస్సీ–2025లో వివిధ క్యాటగిరీలకు చెందిన నాలుగు పోస్టులు అర్హత ఉన్న అభ్యర్థులు లేక భర్తీ కాలేదు. వీటిలో మున్సిపల్ కార్పొరేషన్ మేనేజ్‌మెంట్‌లో ఒక ఎస్జీటీ, ప్రభుత్వ/స్థానిక సంస్థల యాజమాన్యంలో ఒక ఎస్జీటీ, ప్రభుత్వ/స్థానిక సంస్థల యాజమాన్యంలో స్కూల్ అసిస్టెంట్ సంస్కృతం పోస్టులు రెండు భర్తీ కాలేదు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

డీఎస్సీ–2025 ఫైనల్ సెలక్షన్ జాబితాలో సందేహాల నివృత్తికి గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. పలువురు ఉపాధ్యాయ అభ్యర్థులు తాము ఎందుకు అర్హత కోల్పోయామో తెలుసుకునేందుకు కాకినాడ డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

ప్రజాస్వామిక హక్కులు కాపాడాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రజాస్వామిక హక్కులు కాపాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ ప్రజాస్వామ్య దినం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అయితాబత్తుల రామేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది ఎండీ జవహర్ అలీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. వారు మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షాలతో ఒక విధంగా, అధికార పార్టీ సభ్యులతో మరొక విధంగా వ్యవహరించడం ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బ తీస్తుందన్నారు. మహదేవపురంలో రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన సమాధానం గౌరవప్రదంగా లేదన్నారు. బిహార్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనుమానాలకు తావిస్తోందన్నారు. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించకపోతే రాజ్యాంగానికే ప్రమాదమన్నారు. పౌరులంతా రాజ్యాంగ పరిరక్షణకు కలిసి రావాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం నాయకులు టి.నూకరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తి ఆరాధన నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా ప్రజలను అణచి ఉంచి దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

రాష్ట్ర బ్లిట్జ్ చెస్ చాంపియన్‌గా సాత్విక్



రాష్ట్ర బ్లిట్జ్ చెస్ చాంపియన్‌గా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న సాత్విక్

అమలాపురం టౌన్: ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగిన రాష్ట్ర ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన ద్రాక్షారపు సాత్విక్ ప్రథమ స్థానం సాధించాడని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీల్లో 140 మంది క్రీడాకారులు పాల్గొనగా సాత్విక్ బ్లిట్జ్ చెస్‌లో 7 రౌండ్లకు 6.5 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. త్వరలో త్రిపుర రాష్ట్రంలో జరగనున్న నేషనల్ బ్లిట్జ్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో సాత్విక్ మన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించనున్నాడు. నంద్యాలలో చాంపియన్ షిప్ నిర్వాహకుల నుంచి విజేత సాత్విక్ రాష్ట్ర బ్లిట్జ్ చెస్ చాంపియన్‌గా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నాడు. రాష్ట్ర విజేత సాత్విక్‌ను రాష్ట్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కవురు జగదీష్, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వెంకట సురేష్ అభినందించారు.

డేంజర్‌లో ఓజోన్

- పర్యావరణ పరిరక్షణకు నిర్లక్ష్యమే కారణం
- దెబ్బతింటున్న వాతావరణ సమతుల్యత
- కాలుష్యంతో ఏటా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం



రాయవరం: ఎండ, వాన నుంచి మనకు గొడుగు ఎలా రక్షణ ఇస్తుందో కంటికి కనిపించని ఓజోన్ పొర కూడా భూమిపై జీవరాశిని అలానే కంటికి రెప్పలా కాపాడుతోంది. అభివృద్ధి పేరిట కాలుష్యాన్ని పెంచి పోషిస్తుండడం వల్ల ఓజోన్ పొరకు నేడు ప్రమాదం ఏర్పడింది. తుపానులో సుడిగాలికి చేతిలోని గొడుగు అల్లాడినట్లు కాలుష్యం తాకిడికి ఓజోన్ రక్షణ ఛత్రం విలవిల్లాడుతుతోంది. ఇది చిల్లులు పడినా జల్లెడలా తయారైందంటే జీవరాశి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. వనాలు పెంచి.. కాలుష్యాన్ని తుంచి ఓజోన్ పొరను రక్షించుకుంటేనే.. అది మనల్ని రక్షిస్తుంది. ఓజోన్ రక్షిత..రక్షితః అంటూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబరు 16న ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంగా పాటిస్తున్నారు.

దుష్ఫలితాలివీ..

'ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరుతున్నాయి. 'ఫలితంగా మనుషుల్లో చర్మ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్తి తగ్గడం, కంటి సంబంధ వ్యాధులు, చర్మ, క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది. జంతువులపై ఇవి మరింత తీవ్ర పరిణామాలు చూపుతున్నాయి. 'మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ రేటు తగ్గి మొక్కల ఆహార తయారీలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. 'సముద్ర జీవజాలంపై పరోక్షంగా ఈ ప్రక్రియ ప్రభావితం చూపిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. 'ఉష్ణోగ్రతలు పెరిగి, భూమి అగ్నిగోళంలా మారుతుందనే హెచ్చరికలు లేకపోలేదు.

ఆకాశం నీలంగా కనిపించడానికి..

పగటి సమయంలో ఆకాశం నీలంగా కనిపించడానికి ప్రధాన కారణం ఓజోన్ పొర. సూర్యుని నుంచి బయలుదేరిన కిరణాలు భూమిని చేరడానికి 8 నిమిషాలు పడుతుంది. ఈ సూర్య కిరణాల్లో జీవావరణానికి ఉపయోగపడే కిరణాలతో పాటు జీవరాశికి వినాశనం కలిగించే అతి నీలలోహిత (అల్ట్రా వయోలెట్) కిరణాలు కూడా ప్రసరిస్తాయి. ఈ అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమికి చేరినట్లయితే దాని వల్ల జరిగే రసాయన చర్య వల్ల భూమండలం మొత్తం రేడియేషన్ వ్యాపిస్తుంది. తద్వారా జీవుల మనుగడ కష్టమవుతుంది. భూమి నుంచి 20 నుంచి 30 కిలోమీటర్ల ఎత్తులో ఎటువంటి రంగు లేకుండా రక్షణ కవచంలా ఉన్న పొరనే ఓజోన్ పొర అంటారు. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలను ఈ పొర అడ్డుకోవడం వల్ల మనకు పగటి సమయంలోనూ ఆకాశం నీలి రంగులో కన్పిస్తుంది. సూర్యుడు తొలగిన వెంటనే ఎటువంటి నీల లోహిత కిరణాలు ఈ పొరపై ఉండవు. కాబట్టి ఈ పొరగుండా మనం నక్షత్రాలను చూడగలుగుతున్నాం.

జిల్లాలో పరిస్థితి ఇదీ

ప్లాస్టిక్ వాడకం, వాయు కాలుష్య నివారణతో **పాటు వచ్చదనాన్ని** పెంపొందించేందుకు **ప్రతి ఒక్కరూ కృషి** చేయాల్సి ఉంటుంది. **ముఖ్యంగా అడవులు** పర్యావరణానికి ఎంతో **రక్షణగా నిలుస్తాయి.** ఉమ్మడి జిల్లా విస్తీర్ణంలో **33 శాతం అడవులు** ఉండాల్సి ఉండగా, 336 **చదరపు కిలోమీటర్ల** మేర అటవీ ప్రాంతం ఉంది. **జిల్లా విస్తీర్ణంలో** 32 శాతం అడవులు **ఉన్నట్లు గణాంకాలు** చెబుతున్నాయి. జిల్లా **అటవీశాఖ పర్యవేక్షణ**లో 7 టెర్రిటోరియల్ రేంజ్‌లు, 42 టెర్రిటోరియల్ సెక్షన్లు, 95 బీట్లు ఉన్నాయి.

అభివృద్ధి పేరిట వినాశనం

అభివృద్ధి పేరిట ఈ భూమిపై మానవులు వినాశనం సృష్టిస్తున్నారు. కాలుష్యం మూలంగా ఈ ఓజోన్ పొర నెమ్మదిగా కరిగి రంధ్రాలు పడుతున్నట్లు పర్యావరణ నిపుణులు గుర్తిస్తున్నారు. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే క్లోరో ఫ్లోరో కార్బన్‌లు ఈ ఓజోన్ పొరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఆధునిక జీవనం పేరిట రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషన్ల వాడకం పెరగడం కూడా పొరపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి నుంచి వెలువడే గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ వాయువులు పర్యావరణ వినాశనం కావున ఓజోన్ పొరకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నాయి.

మానవ తప్పిదాలే అధికం



మానవ తప్పిదాల వల్లే ఓజోన్ పొరకు చిల్లులు పడే ప్రమాదం కలిగింది. దీని నుంచి సమస్త జీవరాశి మనుగడ సాగించాలంటే ప్లాస్టిక్, విష వాయువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పశు పక్ష్యాదులపై దుష్ప్రభావం



ఓజోన్ పొరను రక్షించుకోకుంటే ఆ ప్రభావం సమస్త మానవాళితో పాటు పశుపక్ష్యాదులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే సెల్ టవర్ల రేడియేషన్ వల్ల పిచ్చుకలు అంతరించిపోతున్నాయి. ఓజోన్ పొరను కాపాడుకుంటే భూతాపాన్ని కాపాడుకోవచ్చు.

– నల్లమిల్లి సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆలమూరు

సమష్టి బాధ్యతగా చేపట్టాలి



మొక్కలు నాటడంతోనే సరికాదు. వాటిని సంరక్షించుకున్నప్పుడే అడవులు పెరుగుతాయి. పర్యావరణ పరిరక్షణ అనేది సమష్టి బాధ్యతగా చేపట్టాలి. అప్పుడే అడవుల విస్తీర్ణం పెరిగి, పర్యావరణ సమతుల్యత ఉంటుంది.

– ఎంవీ ప్రసాదరావు, జిల్లా అటవీ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఆదిత్యలో అట్టహాసంగా వేద-2కే25



మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న సతీష్‌రెడ్డి, తదితరులు

గండేపల్లి: వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో పోటీతత్వాన్ని కొనసాగించడానికి ఉత్తమ సాధన, నిరంతర నైపుణ్యాభివృద్ధి అవసరమని కాకినాడ జేఎన్టీయూకే వైస్ చాన్సలర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ విద్యార్థులనుద్దేశించి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం ఇంజినీరింగ్ డే సందర్భంగా వేద-2కే25 పేరిట జాతీయస్థాయి సాంకేతిక సింపోజియంకు మొదటిరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో భవిష్యత్‌కు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి మాట్లాడుతు జాతీయస్థాయిలో సాంకేతిక ప్రతిభ, ఆవిష్కరణలు పెంపొందించే వేదికగా వేద రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ ఏడాది 14,340 మంది విద్యార్థులు సాంకేతిక పోటీలకు, ఈవెంట్లలో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రో ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్, రవి తంగజన్, వేద కన్వీనర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ముందంజ వేయాలి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ, తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ అందించిన జ్ఞానం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన శ్రద్ధ నుంచి ప్రేరణ పొంది, నూతన ఆవిష్కరణలతో ముందంజ వేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ విద్యార్థులకు సూచించారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 'అద్విక-25' ఇంజినీరింగ్ ఫెస్ట్‌ని సోమవారం దీపారాధనతో ప్రారంభించారు. తొలుత భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జాతి నిర్మాణానికి ఆయన అందించిన సేవలు భారతదేశంలో ఇంజినీరింగ్ నైపుణ్యానికి బంగారు బాటలు వేశాయన్నారు. ఇంజినీరింగ్ అంటే సమీకరణలు, గణనాలు కాదని, దృష్టి, సమగ్రత, పరివర్తన ప్రభావం గురించి అనే ఆలోచనలకు ఆయన జీవితం ఒక నిదర్శనమన్నారు. అద్విక-25లో విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, స్కిల్ హౌస్ వంటి సాంకేతిక పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు వ్యవహరించగా రూరల్ వాటర్ సప్లై విభాగం ఈఈ బి.వెంకటగిరి, డీఈఈ టి.శ్రీనివాసబాబు, ఏఈ వి.అవినాష్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్, ఐసీఐ సెంటర్ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ కేవీ నరసింహారావు, ఓఎన్జీసీ రిటైర్డ్ ఈఈ జీవీవీ ప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల శిక్షణ ప్రారంభం



11 జిల్లాలోని టీఓటీకు శిక్షణ ప్రారంభించిన వైస్ ప్రిన్సిపాల్ రమణ

సామర్లకోట: సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సీనియర్ పంచాయతీ కార్యదర్శులను టీఓటీలుగా ఎంపిక చేసి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన ప్రారంభించారు. కేంద్రం ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గుర్తించి వాటిని గ్రామాలల్లో అమలు చేసే విధంగా చేయాలని సూచించడంతో ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఒకటి నుంచి 8 వరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వీటిపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ఆయా జిల్లాల్లోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వలసి ఉంటుందన్నారు. ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, కె.సుశీల, శ్రీనివాసరావు శిక్షణ తరగతులు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక



అమలాపురంలో సాయిదుర్గను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు



కోడూరుపాడులో క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: ప్రభుత్వం ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో జూనియర్ ఇంటర్మీడియెట్ చదువుతున్న కేదారి సాయిదుర్గ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. సోమవారం సాయిదుర్గను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి సుబ్బరాజు, తాతా అవధాని, పరిపాలనాధికారి ఎ.వెంకటపతిరాజు, ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు, పీడీ సురేష్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సెపక్‌తక్రాలో నలుగురి ఎంపిక

అల్లవరం: కోడూరుపాడు ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారని పీడీ బూల చిరంజీవి సోమవారం తెలిపారు. విజయవాడలో అక్టోబర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. కొడమంచిలి షణ్ముఖ, పీడీవీ సత్యలావణ్య రెగ్యులర్ క్రీడాకారులుగా, సత్యశ్యామల, ఉమ్మడిశెట్టి రత్నకుమారి స్టాండ్ బైగా ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు అభినందించి వారికి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏఎస్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముమ్మిడివరపు సుధీర్, పిల్లా ప్రసాద్ తదితరుల సహకారంతో క్రీడాకారులకు షూ అందజేశారు.

శానిటరీ సిబ్బంది ఆకలి కేకలు

- 15వ తేదీ వచ్చినా అందని ఆగస్టు నెల జీతాలు
- 350 మంది సిబ్బందికి రూ.59 లక్షల బకాయిలు



దేవస్థానం ఆవరణను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అన్నవరం: ఒక నెలలో వచ్చిన సమస్య మరుసటి నెల రాకుండా చూసుకోవడమే మంచి పరిపాలనకు నిదర్శనం. కానీ ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మాత్రం అదే సమస్య ప్రతి నెలా పునరావృతమవుతోంది. ప్రతి నెలా రెండో వారం దాటినా శానిటరీ సిబ్బందికి జీతాలు రాని పరిస్థితి. మా జీతాలు ఎప్పుడిస్తారని ఆ సిబ్బంది ఎదురుచూడడంతోనే సరిపోతోంది. గత ఆరు నెలలుగా ఇదే పరిస్థితి. దేవస్థానంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సెప్టెంబర్ 15వ తేదీ వచ్చినా ఆగస్టు నెల జీతం ఇంకా అందకపోవడంతో 350 మంది సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నెలకు రూ.పది వేలు వచ్చే జీతం రెండు వారాలు గడచినా రాకపోతే వారి పరిస్థితి ఏంటనేది ఊహించొచ్చు. గత ఆరు నెలలుగా జీతాలు ఆలస్యం అవడం దేవస్థానంలో రివాజుగా మారిపోయింది. అయితే ఆగస్టు నెలకు సంబంధించి ఆగస్టు 25న 350 మంది సిబ్బందికి సంబంధించిన పీఎఫ్ చెల్లించి ఆ చలానాలు ఈ నెల రెండో తేదీనే దేవస్థానానికి అందజేసినట్టు శానిటరీ కాంట్రాక్ట్ సంస్థ కనకదుర్గా మేన్‌పవర్ సంస్థ ప్రతినిధి తెలిపారు. 16 మంది కొత్త సిబ్బంది విషయం పక్కన పెట్టి మా 350 మంది శానిటరీ సిబ్బంది జీతాలైనా వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు. దీనిపై ఈవో వీర్ల సుబ్బారావును వివరణ కోరగా త్వరలోనే జీతాలు వారి అకౌంట్లలో పడేలా చూస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, పీడీ, పీఈటీలు

తుని రూరల్: ఈనెల 27 నుంచి మూడు రోజులు ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల బాలికలు ఎంపికైనట్టు ఆ పాఠశాల వి.కొత్తూరు ప్రిన్సిపాల్ డి.ప్రసన్నరాణి సోమవారం తెలిపారు. కాకినాడ రమణయ్యపేటలో జూనియర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ ప్రదర్శించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆమె పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్‌లో హర్షిణి ప్రథమస్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 క్రీడా పోటీల్లో చదరంగంలో వైష్ణవి (ప్రథమ), మణి (6వ), యోగాలో పి.అనురాధ (ప్రథమ), కె.అక్షయ కీర్తి (ద్వితీయ), ఎస్.మేఘనశ్రీ (తృతీయ), ఎం.విజీన (నాలుగో) స్థానాల్లో నిలిచారన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, పీడీ ఆర్.విజయలక్ష్మి, పీఈటీ జి.సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు డీఎస్ఏలో ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మంగళవారం పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలురు, బాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి సోమవారం తెలిపారు. టెన్నిస్, జిమ్నాస్టిక్స్, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హత పత్రాలతో హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు. మిడ్డే మీల్స్ ఎక్విటెన్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయునితో సంతకం చేయించి తప్పనిసరిగా తేవాలన్నారు.

టీ తాగుతూ యువకుడి మృతి

ప్రత్తిపాడు రూరల్: హోటల్ వద్ద టీ తాగుతూ సోమవారం కుప్పకూలి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని ధర్మవరానికి చెందిన వ్యవసాయ కూలి ఎంటిపల్లి సూర్యప్రకాశరావు (32) పొలం వెళ్తూ మార్గంమధ్యలో హోటల్ వద్ద టీ తాగేందుకు ఆగాడు. టీ తాగుతుండగా ఒక్కసారి కుప్పకూలి కింద పడిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన సూర్యప్రకాశరావును ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సూర్యప్రకాశరావు భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు సందర్శించి విచారం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

కపిలేశ్వరపురం: పలు ఆలయాల్లోని హుండీలను, ఒక మోటారు సైకిల్‌ను చోరీ చేసిన ఘటనలో నేరం రుజువు కావడంతో నిందితుడుకి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. 2014 జూలై 23న మండలంలోని టేకి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి, దుర్గమ్మ, రామాలయంలలోని హుండీలు, ఒక మోటారు సైకిల్ చోరీకి గురయ్యాయి. ఆయా ఘటనలపై అప్పటి అంగర ఎస్సై పరదేశి పలు కేసులను నమోదు చేశారు. ఆయా కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితుడైన కె.గంగవరం మండలం తామరపల్లికి చెందిన రేవు శ్రీనివాస్ అలియాస్ తాడే శ్రీనివాస్‌కు మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు జైలు శిక్షను అనుభవించాలంటూ జడ్జి తీర్పు ఇచ్చినట్టు ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపారు.